ఈనాడు
కామారెడ్డి
బుధవారం అక్టోబరు 23, 2024

'కుడా' ప్రతిపాదనలకు ఆమోదం..!

ఈనాడు, కామారెడ్డి

పట్టణీకరణ లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డీటీసీపీ అధికారులు కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. వీటికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గెజిట్ తర్వాత జీవో విడుదల చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాలతో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి కసరత్తు మొదలుపెట్టింది.

కార్యకలాపాలు ప్రారంభించేందుకు సన్నాహాలు

సిబ్బంది నియామకానికి కసరత్తు

డీటీసీపీ అధికారులు 'కుడా' పరిధిలో 334 ఆవాసాలను చేర్చుతూ ప్రభుత్వానికి ప్రతిపాదించగా ఆమోదం లభించింది. కుడాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం గెజిట్ విడుదల చేయగానే కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. కలెక్టరేట్‌లో లేదా ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చారు. తాత్కాలికంగా సిబ్బందిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. కార్యకలాపాలు ప్రారంభం కాగానే సంస్థకు ఛైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు.

డీసీఆర్‌బీ డీఎస్పీ సస్పెన్షన్

ఈనాడు, కామారెడ్డి: జిల్లా పోలీసు కార్యాలయంలో డీసీఆర్‌బీ(డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) డీఎస్పీగా విధులు నిర్వహించిన మదన్‌లాల్‌పై రాష్ట్ర డీజీపీ మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. ఆయనపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ సింధుశర్మకు ఫిర్యాదులు వచ్చాయి. విచారించిన ఎస్పీ నివేదిక డీజీపీకి అందజేయగా చర్యలు తీసుకున్నారు. మదన్‌లాల్ జిల్లాలో పనిచేసిన సమయంలో పలువురు నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. రుణాల పేరిట నగదు తీసుకుని ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడంపై బాధితులు పోలీసులకు మొరపెట్టుకున్నారు. మదన్‌లాల్‌పై ఎన్ఐ(నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్) కింద కేసు నమోదైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్పీ ఆయనను డీసీఆర్‌బీ విధుల నుంచి తప్పించి ఇటీవలే డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

గింజ ముట్టలే.. కాంటా పెట్టలే

ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న అన్నదాతలు

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, నాగిరెడ్డిపేట, బీర్కూర్, భిక్కనూరు



బీర్కూర్ కొనుగోలు కేంద్రానికి 50 మందికి పైగా రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చారు. తూకం కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలతో తడిసిన ధాన్యాన్ని రహదారులపై, మార్కెట్ యార్డులో ఆరబెడుతున్నారు.



నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో 320 మంది రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. ఇంకా కాంటాలు ప్రారంభించలేదు. ఒక్కో రైతు సగటున వారం రోజుల నుంచి ఇక్కడ నిరీక్షిస్తున్నారు.

భిక్కనూరులో పాత జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం



భిక్కనూరు మండలంలో 5 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకాలు వేయడం లేదు. ఇటీవల వర్షాలకు తడవడంతో రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. భిక్కనూరు, పెద్దమల్లారెడ్డి సొసైటీ పరిధిలో సుమారు 30 లారీల ధాన్యం రోడ్లపై ఆరబోశారు.

జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభించినా కాంటాలు వేయలేదు. సుమారు 200లకు పైగా కేంద్రాల్లో రైతులు పంటతో రోజుల తరబడి కల్లాల్లోనే నిరీక్షిస్తున్నారు. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం సేకరణపై సందిగ్ధత నెలకొంది. కొనుగోళ్లపై సమీక్షించాల్సిన పాలకులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంపై కర్షకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలన

తూకం ఎప్పటినుంచో..!

బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, నిజాంసాగర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల్లో వరికోతలు తుది దశకు చేరుకున్నాయి. రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. తూకం వేయడంపై స్పష్టత కొరవడింది. రైసుమిల్లులకు ధాన్యం కేటాయింపుపై ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంది. దీంతో జిల్లాస్థాయి అధికార యంత్రాంగం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోనే సరిపెడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యేలు స్పందిస్తేనే పరిష్కారం

కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ధాన్యం జల్లెడ పట్టేందుకు అవసరమైన యంత్రాలు సరిపడా కనిపించని దాఖలాలు లేవు. వర్షాలకు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. ఆరబెట్టేందుకు రైతులకు కూలీలు, టార్పాలిన్ల భారం తప్పట్లేదు. స్థానిక ఎమ్మెల్యేలు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి త్వరగా నిర్ణయం తీసుకునేలా చేస్తేనే కేంద్రాల్లో కాంటాలు ప్రారంభం కానున్నాయి.

ప్రారంభమైన దళారుల దోపిడీ

కాంటాలు ప్రారంభించకపోవడాన్ని గుర్తించిన దళారులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. రెండ్రోజుల కిందట నిజాంసాగర్ మండలంలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లించకుండానే వెళ్లడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో సేకరించే సమయంలో ఓ ధర చెప్పి చెల్లించే సమయంలో మరోలా ఇష్టా దోపిడీకి పాల్పడుతున్నారు.



సమాచారం ఇవ్వడం లేదు

- కిషన్‌నాయక్, బంజార తాండా, నాగిరెడ్డిపేట

కేంద్రాల్లో ధాన్యం కాంటాలు ఎప్పుడు ప్రారంభిస్తారో దానిపై అధికారులు సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటికే కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పది రోజులవుతోంది. మరో పదిరోజులు ఉండాలంటే కష్టమే. అధికారులు తొందరగా కాంటాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

టార్పాలిన్లు ఇవ్వాలి


కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా కాపాడేందుకు అరిగోస పడుతున్నాం. మార్కెటింగ్ శాఖ అధికారులు టార్పాలిన్లు పంపిణీ చేయడం లేదు. అద్దెకు తీసుకుంటున్నాం. వ్యయం పెరిగిపోతోంది. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు కూలీల ఖర్చు ఇప్పటికే రూ.10 వేలు దాటిపోయింది.

- రమేష్, బీర్కూర్

పగలు, రాత్రి కాపలా..

- పుల్ల సిద్ధారెడ్డి, రైతు, భిక్కనూరు.

వరి కోతలు పూర్తి చేసి 10 రోజులవుతోంది. రోడ్డుపై ధాన్యం ఆరబోసి పగలు, రాత్రి కాపు కాయాల్సి వస్తోంది. భిక్కనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినా తూకం వేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తూకం ప్రారంభించి ఆదుకోవాలి.



నాగిరెడ్డిపేటలో తడిసిన ధాన్యం

ఈ రకాలకే బోనస్..

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీలో భాగంగా క్వింటా సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు రైతుల్లో ఉన్నాయి. వాటిని నివృత్తి చేసేందుకు సర్కారు గుర్తించిన సన్న రకం వంగడాలు ఇవే.

- సాంబ మసూరి (బీపీటీ-5204)
- హెచ్ఎంటీ సోనా
- కూనారం వరి (కేఎన్ఎం-1638)
- కూనారం వరి-1 (కేఎన్ఎం-733)
- జగిత్యాల మసూరి (జేజీఎల్-11470)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్-28545)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్-27356)
- మానేరు సోనా (జేజీఎల్-3828)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3844)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3855)
- పొలాస ప్రభ (జేజేఎల్-384)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్-3855)
- అంజన (జేజీఎల్-11118)
- ప్రత్యుమ్న (జేజీఎల్-17004)
- జేజీఎల్-33124 (పీఆర్సీ)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)
- ఆర్ఎన్ఆర్-31379 (పీఆర్సీ)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్-2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్-2354)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్-21278)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్-14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్-32100)
- వరంగల్ వరి-1119
- వరంగల్ వరి-2 (డబ్ల్యూజీఎల్-962)
- సోమనాథ్ (డబ్ల్యూజీఎల్-347)
- కేపీఎస్-6251 (పీఆర్సీ)
- ఎంటీయూ-1271
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్-34449)
- మార్టేరు సాంబ (ఎంటీయూ-1224)
- మార్టేరు మసూరి (ఎంటీయూ-1262)

నడపడం.. నిలపడం సమస్యే

జిల్లాకేంద్రంలో ప్రణాళిక లోపం, అధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడికక్కడ వాహనాలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. ఇరుకు రోడ్లపై వాహనాలు నడపడం ప్రయాణికులకు కష్టమవుతోంది. పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని దీర్ఘకాలిక ప్రణాళికతో అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కామారెడ్డిలో కొత్తబస్టాండు ఎదుట మంగళవారం వాహనాలను ఇలా నిలపగా న్యూస్‌టుడే క్లిక్‌మనిపించింది.
– కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే



గౌరారంలో సంయుక్త సర్వే

నాలుగేళ్ల పోరాటానికి తెర

గాంధారి, న్యూస్‌టుడే: గౌరారం పరిధిలో అన్యాక్రాంతమవుతున్న అటవీ భూమిని కాపాడేందుకు గ్రామస్థులు నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు రెవెన్యూ, అటవీ అధికారులు ఆ ప్రాంతంలో మంగళవారం సంయుక్తసర్వే ప్రారంభించారు. గాంధారి, బాన్సువాడ రేంజి అధికారులు హేమచందన, హబీబ్, రెవెన్యూ ఆర్ఐ శ్రీనివాస్, ఎల్లారెడ్డి, గాంధారి సర్వేయర్‌లు అటవీ భూమిలో దాదాపు 50 ఎకరాల్లో సర్వే చేశారు. సరిహద్దులు నిర్ధారించారు. బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే చేపట్టనున్నారు. మొత్తం 150 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.



సరిహద్దులు గుర్తిస్తున్న సిబ్బంది

వైద్యుల వివరాల బోర్డు ఏర్పాటు చేయండి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యుల పేర్లు, వివరాలు తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ చేసుకోని ఆసుపత్రులకు తాఖీదులు జారీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 127 ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని తెలిపారు. మరో 19 ఆసుపత్రులకు ప్రతిపాదనలు రాగా.. 17 ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వడానికి కమిటీ అంగీకారం తెలిపినట్లు వివరించారు. ఆసుపత్రుల్లో వైద్యులు మారితే సమాచారాన్ని వైద్యఆరోగ్యశాఖకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సింధుశర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఐఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి, పక్కన ఎస్పీ



జాతీయగీతం ఆలపించి.. అమరవీరులను స్మరించి

కామారెడ్డిలోని నిజాంసాగర్‌చౌరస్తాలో మంగళవారం మానవహారం నిర్వహించి జాతీయ గీతాలాపన చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

మద్యం విక్రయాలపై గ్రామస్థుల ఫిర్యాదు

దోమకొండ : అంబారిపేటలో కల్తీ కల్లు, గొలుసు దుకాణాలలో మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు దోమకొండలోని ఠాణా, ఆబ్కారీ సీఐ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. కల్తీ కల్లును అరికట్టాలని, గొలుసు దుకాణాలను తొలగించాలని ఫిర్యాదు చేశారు.

నిజాంసాగర్ నుంచి నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 12,150 క్యూసెక్కులు రాగా.. అంతే నీరును మూడు వరద గేట్ల ద్వారా మంజీరాలోకి విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ ప్రకటనలో తెలిపారు. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.90 అడుగులు (17.687 టీఎంసీలు) నీరు ఉందన్నారు.

'మత్స్యకారుల సమస్యలు అసెంబ్లీలో చర్చిస్తా'

భిక్కనూరు, న్యూస్‌టుడే: మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వెంకటమరమణారెడ్డి అన్నారు. మంగవారం జంగంపల్లి పెద్దచెరువులో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా గ్రామస్థులు కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాదెం సత్యనారాయణ, గ్రామాధ్యక్షుడు బుచ్చి సతీష్‌కుమార్, గంగపుత్ర సంఘం గ్రామాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీపతి తదితరులున్నారు.



జంగంపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే



తల్లిదండ్రులతో సమావేశం.. ఉత్తీర్ణతకు దిశానిర్దేశం

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

జిల్లాలో గత విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలు నిరాశపరిచాయి. రాష్ట్రస్థాయిలో జిల్లా 35వ స్థానానికి పడిపోయి ఉత్తీర్ణత శాతం అట్టడుగు స్థాయికి చేరింది. ఈ సారి అధికార యంత్రాంగం ముందుగానే మేల్కొంది. క్షేత్రస్థాయిలో చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ఇటీవల దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమావేశం నిర్వహించి సత్ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

ఏమేం చేయనున్నారంటే..

డిసెంబరు నాటికి శత శాతం పాఠ్యప్రణాళిక పూర్తి చేసి పునరుశ్చరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. వీలైనన్నీ నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వనున్నారు. ప్రత్యేక

ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు

బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిత్యం జూనియర్ కళాశాలల నుంచి నివేదిక తెప్పించుకోనున్నారు. కళాశాలలో విద్యార్థుల హాజరు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. పిల్లలను గమనించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. 'చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తున్నాం. ఒకటికి రెండుసార్లు శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులకు సూచించాం. ఈ సారి 80 నుంచి 90 శాతం ఉత్తీర్ణత సాధించేలా కసరత్తు చేస్తున్నాం.' అని డీఐఈవో షేక్ సలాం అన్నారు.



ఇటీవల దోమకొండలో కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

ఆధునికీకరణకు అడుగులు

● రవాణా శాఖలో సమూల మార్పులకు శ్రీకారం

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

రవాణా శాఖ ఆధునికీకరణ వైపు అడుగులు వేస్తోంది. దేశంలోని 28 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న 'వాహన్ పోర్టల్'లో రాష్ట్ర రవాణా శాఖ చేరబోతోంది. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ విషయంలోనూ.. దేశవ్యాప్తంగా ఒకే విధానం 'సారథి'ని అమలు చేయనున్నారు. ఈ విధానాలపై కథనం.



కామారెడ్డి జిల్లా రవాణా శాఖ కార్యాలయం

'వాహన్ పోర్టల్'తో..

వాహన్ పోర్టల్‌తో బీమా కంపెనీలను అనుసంధానం చేయడం వల్ల మోసాలను నియంత్రించవచ్చు. ఆధార్ కార్డ్, ఓనర్ సర్టిఫికేషన్, పొల్యూషన్ పరీక్షించుకొనే పని తప్పుతుంది. మోసాలకు అవకాశం లేకుండా పోతుంది.

స్క్రాప్ ఏజెన్సీలు రాబోతున్నాయ్: కాలం చెల్లిన వాహనాలను అమ్మడానికి ప్రభుత్వం స్క్రాప్ ఏజెన్సీలను ఏర్పాటు చేయనుంది. సదరు ఏజెన్సీ వాహనానికి ధర నిర్ణయించి చెల్లిస్తుంది. అనంతరం వారు వాహన యజమానికి పత్రాన్ని ఇస్తారు. దానిని తీసుకెళ్లి.. రవాణా శాఖ కార్యాలయంలో అప్పగిస్తే అధికారికంగా ఓ ధ్రువపత్రాన్ని అందజేస్తారు. సదరు వ్యక్తి భవిష్యత్‌లో కొత్త వాహనం తీసుకోవాలనుకుంటే.. అధికారులు ఇచ్చిన ఆ పత్రాన్ని చూపిస్తే.. వాహన ధరలో కొంత మేర తగ్గే అవకాశముంటుంది.

☛ ఏటీఎస్, ఏడీఎస్ కేంద్రాలు: వాహనాల ఫిట్‌నెస్‌ను ఏటీఎస్(ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్)లో యంత్రాల పైనే సాంకేతికత సాయంగా పరీక్షిస్తారు. జిల్లా కేంద్రంలో రూ.8 కోట్లతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో ఏటీఎస్ కోసం స్థలం కావాలని రవాణా శాఖ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదించినట్లు సమాచారం.

☛ డ్రైవింగ్ టెస్టులకు ఏడీఎస్ (ఆటోమేటిక్ డ్రైవింగ్ స్టేషన్) రూపొందించనున్నారు. ఈ స్టేషన్లో ఆధునికీకరించిన ట్రాక్ ఏర్పాటు చేస్తారు. ఈ ట్రాక్‌లను కంప్యూటరీకరిస్తారు. సరైన విధానంలో వాహనాన్ని నడుపుతున్నారా లేదా అని సాంకేతికత ఆధారంగా పరీక్షించి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఏడీఎస్‌ల ఏర్పాటు కోసం కామారెడ్డిలో 6 ఎకరాలు, బాన్సువాడలో 3 ఎకరాలు కేటాయించాలని రవాణా శాఖ అధికారులు ప్రతిపాదించారు.

విద్యాసంస్థల్లో పార్కుల ఏర్పాటు

విద్యార్థుల్లో రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన పెంచేందుకు ఒక్కో విద్యాసంస్థలో రూ.2.50 లక్షలతో 'రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ పార్క్'ను ఏర్పాటు చేస్తారు. తొలుత ప్రైవేట్ విద్యాసంస్థల్లో అమలుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ పార్కుల ఏర్పాటుకు యాజమాన్యాలు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. 'వాహన్ పోర్టల్', 'సారథి' అమలుతో పారదర్శకతకు అవకాశముంటుంది. అక్రమాలను పూర్తిగా నివారించవచ్చు. రహదారి ప్రమాదాలను కట్టడి చేయవచ్చు. అధికారులకు పని భారం తగ్గే అవకాశాలున్నాయి.' అని కామారెడ్డి జిల్లా రవాణా శాఖ ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించగా.. సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు.



గింజలు తీయడానికి 'ప్యాడి హస్కల్'

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడి హస్కల్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంలో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈ విధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్న రకం బియ్యమో కాదో తెలుసుకుంటారు.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో సన్న బియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

సంచులపై కోడ్

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డ రకం సంచులపై ఆకుపచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరిస్తారు.

ఐరీస్ విధానం

ధాన్యం కొనుగోళ్లలో ఇది వరకు ఓటీపీ విధానం అనుసరించేవారు. కేంద్రం నుంచి లారీల్లో ధాన్యాన్ని పంపేటప్పుడు ఓటీపీ తీసుకొని ట్రక్‌షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఇప్పుడు సంబంధిత రైతు ఐరీస్ తీసుకోనున్నారు.

పవన్.. కెమెరామెన్

● సినిమాల్లో రాణిస్తున్న బీబీపేట మండలవాసి

న్యూస్‌టుడే, బీబీపేట(కామారెడ్డి)

చిన్నప్పటి నుంచి సినిమాలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ మక్కువతోనే నేడు కెమెరామెన్‌గా రాణిస్తున్నాడు. అతడే బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పప్పుల పవన్‌కుమార్. పవన్‌కు సినిమాల్లో దర్శకత్వం చేయాలనే తపన ఎక్కువగా ఉండేది. డిగ్రీ పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులను ఒప్పించి దిల్లీ ఫిల్మ్ స్కూల్‌లో 2012లో అడ్మిషన్ పొందాడు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత తన స్నేహితుడి ద్వారా ఓ కెమెరామెన్ దగ్గర అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేయడం మొదలు పెట్టాడు. అలా పనిచేసే సమయంలోనే కొన్ని ప్రైవేటు, వాణిజ్య వ్యాపారాలకు సంబంధించిన ప్రకటనలను చిత్రీకరించాడు. అక్కడ నుంచి ప్రముఖ తమిళ్ కెమెరామెన్ ముఖేష్ వద్ద అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. అలా అనుభవం సాధించి ఇటీవల రెండు సినిమాలకు తానే కెమెరామెన్‌గా పనిచేశాడు.

పనిచేసిన సినిమాలు

తెలుగులో రోగ్, ఇజం, పైసా వసూల్, నేలటికెట్టు సినిమాలకు, హిందీలో అథిత్, నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న బాహుబలి(ది రైజ్ ఆఫ్ శివగామి) అనే వెబ్‌సిరీస్‌కు పవన్ అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. ఉస్తాద్ సినిమాకు, ప్రస్తుతం ప్రొడక్షన్ దశలో ఉన్న అనగనగా(ఈటీవి విన్ ఒరిజినల్స్)కు కెమెరామెన్‌గా చేశారు.



దర్శకుడు కావాలనే లక్ష్యం
- పవన్‌కుమార్ పప్పుల

సినిమాలపై ఇష్టంతో ఇండస్ట్రీలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాను. కెమెరామెన్‌కు, దర్శకుడికి దగ్గర సంబంధాలుంటాయి. దర్శకుడి మదిలోని కథను దృశ్యంగా చూపేవాడే కెమెరామెన్(సినిమాటోగ్రాఫర్). కెమెరామెన్‌గా మంచి సినిమాలు తీసి పేరు సంపాదించుకుని దర్శకుడిగా ఎదగాలన్నదే లక్ష్యం. దర్శకత్వం చేయడం కోసం కొన్ని కథలను సైతం సిద్ధం చేస్తున్నాను.

లెక్కలేనితనంపై సర్కారు గుర్రు

- జిల్లాలో ప్రారంభించని డిజిటల్ సర్వే
- ధాన్యం కొనుగోళ్లపై ప్రతిష్టంభన
- నలుగురు ఏఈవోలపై వేటు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

ఏ పంట ఎక్కడ? ఎంత వేశారు? అనే దానిపై కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ సర్వే జిల్లాలో ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికే సాగు విస్తీర్ణంలో సగానికి పైగా కోతలు పూర్తయ్యాయి. వారం పది రోజులైతే వానాకాలం సీజన్ ముగుస్తుంది. ఈ తరుణంలో లెక్కలు తీసినా ఉపయోగం లేదు. వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) ఇది పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. అయినా రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు ససేమిరా అంటున్నారు. దాదాపు నెల రోజులుగా ప్రతిష్టంభన కొనసాగుతుండగా తాజాగా జిల్లాలో నలుగురు సిబ్బందిపై వేటు వేశారు.

మెమోలిచ్చినా మారని తీరు..

డిజిటల్ యాప్‌ను తమ ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటేనే హాజరు పడుతుంది. ఎక్కడ.. ఏం చేశారో చిత్రంతో సహా అందులో నమోదవుతుంది. ఇది ఎప్పటికప్పుడు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతాధికారులకు తెలుస్తుంది. రాష్ట్ర యూనియన్ నేతల పిలుపుమేరకు సిబ్బంది జిల్లాలోనూ యాప్ డౌన్‌లోడ్‌కు నిరాకరించారు. దీనిపై గుర్రుగా ఉన్న ఉన్నతాధికారులు జిల్లాలో 107 మంది ఏఈవోలకు ఇప్పటికే మెమోలిచ్చారు. తాము రాష్ట్ర నాయకత్వం నిర్ణయం మేరకే నడుచుకుంటామని, విధులకు హాజరవుతూనే నిరసన తెలుపుతున్నట్లు ఏఈవోల సంఘం ప్రతినిధులు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.



వేటుపడిన ఏఈవో స్థానాలు

మండలం	క్లస్టర్	పేరు
ఆర్మూర్	ఆర్మూర్	సవిత
అలూర్	ఆలూర్	వసుధం
ఎడపల్లి	ఎడపల్లి	జ్యోతి
ని॥ రూరల్	గుండారం	రాకేశ్

ఒప్పంద సిబ్బందికి ఇబ్బంది

వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో జిల్లావ్యాప్తంగా 8 మంది ఏఈవోలను రూ.16 వేల వేతనం చెల్లిస్తూ ఒప్పంద పద్ధతిపై నియమించారు. రెగ్యులర్ సిబ్బందితో కలిసి డిజిటల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో వీరి మెడపై కత్తి వేలాడుతోంది. సర్వేలో పాల్గొనకుంటే ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందోనని ఆందోళన వారిలో మొదలైంది.

ధాన్యం సేకరణ కష్టమే..

ఈ ఏడాది జిల్లాలో 5.49 లక్షల ఎకరాల్లో పంటలేయగా వరి ఒక్కటే 4.29 లక్షల ఎకరాల్లో ఉంది. సన్నాలు 3.60 లక్షల ఎకరాల్లో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ గ్రామీణం, ఆర్మూర్ డివిజన్లలో వరి కోతలు సగం పూర్తయ్యాయి. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వాటిని గుర్తించడంలో ఏఈవోలది కీలక పాత్ర. మహారాష్ట్రతో సరిహద్దు ఉండటంతో ఆ ధాన్యం ఇక్కడికి రానీయకుండా వ్యవసాయశాఖ సిబ్బందికి తనిఖీ కేంద్రాల వద్ద విధులు కేటాయించారు. ఈ పరిస్థితుల్లో విధులకు దూరంగా ఉంటే కొనుగోళ్లు నిలిచేపోయే ప్రమాదం ఉంది.

నిర్లక్ష్యం వల్లే చర్యలు

- వాజీద్ హుస్సేన్, నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్రవ్యాప్త చర్యల్లో భాగంగా నలుగురు ఏఈవోలను సస్పెండ్ చేశాం. వీరు రైతు బీమా, ఇతరత్రా సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం వల్లే వేటు వేశాం. ఒప్పంద సిబ్బందిని విధుల్లో చేరాలని పిలిచాం. ప్రభుత్వ నిర్ణయాలు పాటించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.



విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్

కుమురం భీం జయంతి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కుమురం భీం అని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హన్మాజీపేట్‌లో ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మంగళవారం కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, శ్రీధర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బాన్సువాడ పట్టణం: బోర్లం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హన్మాజీపేట్‌లో మంగళవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ప్రారంభించారు.



కామారెడ్డి జిల్లాకేంద్రం సైలన్‌బాబా కాలనీలో రెండేళ్ల క్రితం రూ.60 వేలతో కల్వర్టు నిర్మించారు. నిర్మాణ సమయంలో నీళ్లతో సరిగా క్యూరింగ్ చేయలేదు. దీంతో అనతికాలంలోనే కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం 300- 400 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పగుళ్లుబారి కుంగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

పరిశీలన



జిల్లాకేంద్రం రామారెడ్డి రోడ్డుకు వెళ్లే చోట 20 నెలల క్రితం కల్వర్టు నిర్మించారు. ఇది పూర్తిగా కంకర తేలి నాణ్యతా లోపాలు వెలుగు చూశాయి. పనులు చేసేటప్పుడు యంత్రాంగం పర్యవేక్షణ కొరవడటంతో ప్రగతి గాడి తప్పింది.

నాణ్యత లేమి.. పట్టించుకోరేమి?

● కామారెడ్డిలో ఇష్టారీతిన కల్వర్టు పనులు

న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

కామారెడ్డి జిల్లాకేంద్రంలో	
వార్డులు:	49
కల్వర్టులు:	380–400
పాడైనవి:	50–60

పది కాలాల పాటు మన్నాల్సిన ప్రగతి పనులు ఏడాది నుంచి రెండేళ్ల లోపే దెబ్బతింటున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనుల్లో నాణ్యత లోపాలు వెలుగు చూస్తున్నాయి. మూడేళ్లలో 30 నుంచి 40 కల్వర్టులు పాడయ్యాయి. కొన్ని చోట్ల కూలిపోయాయి.

సర్వే చేపడితే మేలు

వార్డుల్లో అనేక ప్రాంతాల్లో ఒక రోడ్డు నుంచి మరో చోటుకు వెళ్లేందుకు వీలుగా కల్వర్టులు నిర్మిస్తారు. ఆయా వార్డుల్లో 8-10 కల్వర్టులు ఉంటాయి. ఇవి గుత్తేదారులకు కలిసి వస్తున్నాయి. నాసిరకంగా చేపట్టడంతో త్వరగా కూలిపోతుండటంతో అక్కడ తిరిగి పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పురపాలక శాఖ అధికారులు వార్డుల్లో జరిగే ప్రగతి పనులను పర్యవేక్షించాలి. ఏఈ స్థాయి అధికారి దగ్గరుండి మరీ వీటిని పరిశీలించాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవు. ఈ విషయమై పుర కమిషనర్ సుజాత స్పందిస్తూ.. పనులు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, పాడైన కల్వర్టుకు మరమ్మతులు చేపడతామన్నారు.

గొలుసు చోరీ దొంగలు రిమాండ్

వేల్పూర్, న్యూస్‌టుడే: ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు దొంగిలించిన ఇద్దరిని వేల్పూర్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, వేల్పూర్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఇద్దరు దుండగులు వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు మహిళలు బస్ కోసం వేచి ఉండటాన్ని గమనించారు. అందులోని ఓ మహిళ మెడలోంచి రెండున్నర తులాల బంగారం గొలుసు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల సాయంతో ద్విచక్రవాహనం, వారు ధరించిన దుస్తుల ఆధారంగా లక్కోర శివారులో నిందితులను పట్టుకున్నారు. నిందితులు జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన షేక్ జైలద్దీన్, నిర్మల్‌కు చెందిన భూంపల్లి సంతోష్‌గా గుర్తించారు. వీరు మెట్‌పల్లిలో గొలుసు విక్రయించేందుకు వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తల్లి, ఇద్దరు కుమారుల అదృశ్యం

దోమకొండ, న్యూస్‌టుడే: అంచూరుకు చెందిన గెరిగెంటి ప్రవంతి, తన ఇద్దరు కుమారులు రిషివర్ధన్ (10), సాయివర్ధన్ (8) అదృశ్యమయ్యారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ప్రవంతి భర్త గెరిగెంటి రాజు మంగళవారం దోమకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం తాను మేస్త్రీ పని కోసం వెళ్లిన సమయంలో భార్య ఇంట్లో ఉండగా, ఇద్దరు కుమారులు దోమకొండలో ప్రైవేటు పాఠశాలకు వెళ్లారని రాజు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. పిల్లల కోసం స్కూల్‌కి వెళ్లి తెలుసుకోగా, అదే రోజు మధ్యాహ్నం తల్లి పిల్లలను తీసుకెళ్లినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గాంధారి, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లాలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు పొతంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బావన, అక్షయ, పేట్‌సంగెంకు చెందిన సుచరిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎంలు రంగారావు, కుమారస్వామి తెలిపారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా కార్యదర్శిగా కామారెడ్డికి చెందిన చంద్రశేఖర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులుగా వెంకట్‌గౌడ్, మోతీరాం, కె.నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులుగా రవీందర్, సురేశ్, అరుణ్, రేణుక, ఖలీల్, అజయ్ తదితరులు ఎన్నికయ్యారు.



కామారెడ్డిలో ప్రతులు ప్రదర్శిస్తున్న తపస్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి

28న ధర్మాగ్రహ దీక్ష

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష ప్రతులను జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న తహసీల్దార్లకు వినతిపత్రం అందజేత, నవంబర్ 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 23న రాష్ట్రస్థాయి ధర్నా చేపడతామన్నారు. ప్రతినిధులు రాంచంద్రం, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పొరుగుసేవల ఉద్యోగాలకు దరఖాస్తులు

కామారెడ్డి వైద్యవిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి వైద్య కళాశాలలో పొరుగుసేవల ప్రాతిపదికన పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శివప్రసాద్ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి నవంబర్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమగ్ర వివరాలకు http:///gmckamareddy.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 13 మేక పిల్లల మృత్యువాత

దోమకొండ: దోమకొండలో ఎర్రని దత్తయ్యకు చెందిన 13 మేక పిల్లలను కుక్కలు చంపేశాయి. స్థానికుల వివరాల ప్రకారం.. దత్తయ్య మేకల మందను మేపేందుకు వెళ్లగా వాటి పిల్లలను కొట్టంలో వదిలివెళ్లారు. కుక్కలు కొట్టంలోకి వచ్చి మేక పిల్లలపై దాడి చేసి కొరికేశాయి. రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

తెవివి అభివృద్ధే లక్ష్యం కావాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో తెవివి నూతన వీసీ ఆచార్య టి.యాదగిరి రావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య యాదగిరిరావును ఉద్దేశించి తెవివిని రాష్ట్రంలోనే మోడల్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేయాలని సీఎం సూచించారు. వీసీ మాట్లాడుతూ.. వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు సరైన ప్రణాళికతో వస్తే ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేసి అన్ని విధాలుగా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే వర్సిటీలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని తెలియజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తెవివి ఉపకులపతి ఆచార్య యాదగిరిరావు, చిత్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

28లోపు చెల్లించాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెవివి పరిధిలోని ఎంఈడీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు అక్టోబరు/నవంబరు-2024 బ్యాచ్ విద్యార్థులకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28వ తేదీలోపు చెల్లించాలని వర్సిటీ సీవోఈ ఆచార్య అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో నవంబర్ 1 తేది వరకు చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

సదస్సు జయప్రదానికి పిలుపు..

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా కాకతీయ వర్సిటీలో మాదిగ విద్యార్థులతో ఈ నెల 24న వర్సిటీల సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ నాయకుడు శ్రీష్ తెలిపారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు.

ప్రయాణికుల కళ్లలో దుమ్ము



రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్ మిల్లులోంచి నిత్యం దుమ్ము వెలువడుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. 11వ రాష్ట్ర రహదారి నుంచి కామారెడ్డి మండలం క్యాసంపల్లి, రాఘవాపూర్, దోమకొండ మండలం చింతామన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల మీదుగా దోమకొండకు వెళ్లే దారిలో ఈ దుస్థితి నెలకొంది. నిత్యం ప్రయాణికుల కళ్లలో దుమ్ము పడుతున్నా పట్టించుకునే వారు లేరు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

క్రీడాకారుడికి అభినందన

రామారెడ్డి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారుడిని గురుకుల ప్రిన్సిపల్ శివరాం మంగళవారం అభినందించారు. గుంటూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థి ప్రవీణ్ రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



కామారెడ్డిలో 26వ వార్డులో చెత్త సేకరణ జరగడం లేదని స్థానికుడు రాహుల్ ఫిర్యాదు చేయగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి పరిష్కరించారు.

స్పందనకు వందనం

జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంపై స్థానికుడు గణేశ్ సమస్యను ఈనాడుకు వివరించగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.

జిల్లాకేంద్రంలోని వడ్ల గల్లీలో మురుగు కాల్వ పూడిక పేరుకుపోవడంపై స్థానికుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.

సమస్య: దోమకొండలోని 8,9వ వార్డుల్లో మురుగుకాలువలు శుభ్రం చేయడం లేదు.
- **కుమార్, దోమకొండ**

స్పందన: సిబ్బందితో 9వ వార్డులో కాలువల శుభ్రం పనులను ప్రారంభించాం. - **గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి**

సమస్య: రామారెడ్డి మండల కేంద్రంలో పల్లె దవాఖానా పక్కన వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.
-సురేష్, గ్రామస్థుడు

సమాధానం: శుభ్రం చేయిస్తాం.
- క్రాంతి, కార్యదర్శి

సమస్య: పిట్లం మండల కేంద్రంలోని 108 అంబులెన్సు కార్యాలయ ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. **-గోవింద్, స్థానికుడు**

సమాధానం: మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపడుతాం. **కార్యదర్శి, యాదగిరి**

సమస్య: బాన్సువాడ 4వ వార్డులో పలు చోట్ల రోడ్లపై చెత్త నిల్వలు, మొరం కుప్పలతో రాకపోకలకు ఇబ్బంది మారింది.
- ప్రశాంత్, బాన్సువాడ

పరిష్కారం : ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్త నిల్వలు తొలగింపజేయించారు.

న్యూస్‌టుడే, పిట్లం,బాన్సువాడ పట్టణం, రామారెడ్డి, కామారెడ్డి పట్టణం, దోమకొండ

సమస్యలు వెంటాడుతుంటే.. చదువుకునేదెలా?

● దోమకొండ కళాశాలలో సౌకర్యాల లేమి

న్యూస్‌టుడే, దోమకొండ

ఆహ్లాదకర వాతావరణం, మౌలిక వసతుల కల్పన ప్రతి విద్యాలయంలో ఉండాలి. అప్పుడే విద్యార్థులు శ్రద్ధతో చదువుకుంటారు. కానీ, దోమకొండలోని జూనియర్ కళాశాలలో అనేక సమస్యలు కొలువుదీరాయి. ఈ పరిస్థితితో ఏటా కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.

ఇంటి నుంచే తాగునీరు, మూత్రశాలలు లేవు..

కళాశాలలో ప్రధానంగా తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్తు ఇబ్బందులు వెంటాడుతున్నాయి.



అసంపూర్తిగా మూత్రశాల నిర్మాణం...



పనిచేయని ఆర్వో ప్లాంటు

నిధుల లేమితో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు ప్రైవేటు బాట పడుతున్నారు. తాగునీరు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. కళాశాలలోని ఆర్వో ప్లాంటు చెడిపోయింది. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మూత్రశాలలు లేవు. గతంలోని పాత మూత్రశాలలు చెడిపోగా, అవి ఉపయోగంలో లేవు. కళాశాలలో స్కావెంజర్ కూడాలేరు. మూత్రశాలలకు సంబంధించిన మరొక నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. మొత్తం 12 తరగతి గదులు ఉండగా, 10 గదుల్లో విద్యుత్తు సౌకర్యం లేదు. ఫ్యాన్లు, వైరింగ్, ఇతరత్రా పూర్తిగా చెడిపోయి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

	బాలురు	బాలికలు	మొత్తం
జూనియర్ ఇంటర్	81	48	129
సీనియర్ ఇంటర్	117	53	170
మొత్తం విద్యార్థులు	198	101	299

ఇబ్బందులు పడుతున్నాం

-నందిని, సీనియర్ ఇంటర్, పెద్దమల్లారెడ్డి



తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. వాటర్ బాబుల్స్ తెచ్చినప్పటికీ అందరికీ సరిపోవటం లేదు. ఇంటి నుంచి వాటర్ బాటిల్ తెచ్చుకోవాల్సి వస్తోంది. తాగు నీటి సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

ఉన్నతాధికారులకు నివేదించా

-శంకర్, ప్రిన్సిపల్, జూనియర్ కళాశాల, దోమకొండ

సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించా. పరిష్కారానికి కృషి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు.

దారంతా లారే.. ప్రయాణం సవాలే

అల్లాపూర్, పారడ్‌పల్లి, కాటేపల్లి, కాటేపల్లి తండా, చిల్లర్గి గ్రామాల ప్రజలు పెద్దకొడప్‌గల్‌కు రాకపోకలు సాగించేందుకు ఉన్న మార్గం ఇది ఒక్కటే. లేదంటే బుర్నాపూర్, చిన్నకొడప్‌గల్ గ్రామాల మీదుగా సుమారు పది కిలోమీటర్లు తిరిగిరావాల్సి ఉంటుంది. బాన్సువాడ వైపు నుంచి పెద్దకొడప్‌గల్‌కు గన్నీ సంచుల లోడుతో వెళ్తున్న లారీ మంగళవారం మల్కాపూర్ శివారులో నడి రహదారిపై కూరుకుపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆయా ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలు విషయం తెలియక అక్కడి దాక వచ్చి తిరుగుముఖం పట్టాయి. ద్విచక్రవాహనదారులు మాత్రం అతి కష్టం మీద రాకపోకలు సాగించారు.

– పిట్లం, న్యూస్‌టుడే



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బాన్సువాడ పట్టణం, లింగంపేట న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు జిల్లా పరిషత్ కొన బాన్సువాడ, బోర్లం, కొనాపూర్ ఉన్నత పాఠశాలల్లో, లింగంపేటలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య, మండలాధ్యక్షులు నర్సింహచారి, వేద్ ప్రకాశ్, ప్రసాద్ పాల్గొన్నారు.



కొనాపూర్‌లో నిరసన తెలుపుతున్న తపస్ ప్రతినిధులు

కొనుగోలు కేంద్రాల్లో కన్నీటి వెతలు

నాగిరెడ్డిపేట్, లింగంపేట న్యూస్‌టుడే: నాగిరెడ్డి పేట, లింగంపేట మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. నీళ్లలో ఉన్న ధాన్యాన్ని చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షధాటికి పలు చోట్ల వడ్లు కొట్టుకుపోయాయి.



లింగంపల్లిలో తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సదాశివనగర్, బీర్కూర్ న్యూస్‌టుడే: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సదాశివనగర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు పడిగెల రాజేశ్వర్ అన్నారు. సదాశివనగర్, అమర్లబండ, పద్మాజివాడి గ్రామాల్లో నేలవాలిన పంటలను ఆయన పరిశీలించారు. బీర్కూర్‌లోని కామప్ప కూడలి వద్ద భారాస నాయకులు రైతు భరోసా అమలు చేయాలని నిరసన తెలిపారు. బాన్సువాడ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జుబేర్, రాములు, గణేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



నేలవాలిన పంటను చూపుతున్న భారాస నాయకులు

నెల రోజుల్లోగా గదుల నిర్మాణం పూర్తి

బీబీపేట, న్యూస్‌టుడే: బీబీపేటలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలో విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారని, నెల రోజుల్లోగా అదనపు గదుల నిర్మాణం పూర్తి చేయాలని పాఠశాల భవన నిర్మాణ యజమానికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అదనపు గదులు నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. జడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఎంజేపీటీ బీసీడబ్ల్యూఆర్ఎస్ సొసైటీ జాయింట్ సెక్రటరీ తిరుపతి, ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ స్థలం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నాణ్యత పాటించకుంటే చర్యలు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని ఆర్డీవో ప్రభాకర్ హెచ్చరించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం మధ్యలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి: కలెక్టర్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 44, 161 జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. టెక్రియాల్, పొందుర్తి, భిక్కనూరు గ్రామాల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ర.భ శాఖ ఈఈ రవిశంకర్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఈవో రాజు, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనిస్తాం

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: కాళ్లు కోల్పోయిన దివ్యాంగులకు తమ వంతు చేయూత అందిస్తామని నెమ్లి సాయిబాబా ఆలయ ధర్మకర్త మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెమ్లిలోని సాయి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఖమ్మం రోటరీక్లబ్ సౌజన్యంతో దివ్యాంగుల ఎంపిక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 మంది దివ్యాంగులు శిబిరానికి వచ్చారు. కాళ్లు పోగొట్టుకున్న వారికి కావాల్సిన కృత్రిమ కాళ్ల కొలతలు వైద్యులు తీసుకున్నారు. నెల రోజుల్లో జైపూర్ కృత్రిమ కాళ్లతో పాటు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తామని మోహన్‌రెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులు నందుపటేల్, సత్యనారాయణ, వెంకట్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, యశ్వంత్‌రెడ్డి ఉన్నారు.

కుమురంభీంకు నివాళి



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని భాజపా జిల్లా కార్యాలయంలో మంగళవారం కుమురంభీం జయంతి నిర్వహించి నివాళులర్పించారు. పార్టీ గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌నాయక్, నాయకులు బండారి నరేందర్‌రెడ్డి, రవి, బాలు, రంజిత్ తదితరులున్నారు.

కనీసవేతనాలు అమలు చేయాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కమిషనర్ సుజాతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు రాజనర్సు, మహబూబ్ మాట్లాడారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 25న రాష్ట్ర రాజధానిలో పురపాలక శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

కామారెడ్డిలో పురపాలక కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు



నిందితులను శిక్షించాలని డిమాండ్

బాన్సువాడ పట్టణం, మద్నూర్, పిట్లం, గాంధారి, నస్రుల్లాబాద్ న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బాన్సువాడ, మద్నూర్, పిట్లం గాంధారిలో మంగళవారం బంద్ నిర్వహించారు. హిందూ సంఘాలు, భాజపా నాయకుల ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాలను మూసివేయించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీలు చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన తెలిపారు.



బాన్సువాడ పట్టణం : ర్యాలీ చేపడుతున్న ప్రతినిధులు



పిట్లంలో ధర్నా చేస్తున్న హిందూ సంఘాల నాయకులు



మద్నూర్‌లో..

గాలికుంటు వ్యాధితో పాల దిగుబడిపై ప్రభావం

రామారెడ్డి, న్యూస్‌టుడే: గాలికుంటు వ్యాధితో పాల దిగుబడి తగ్గుతుందని, పశువులకు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మద్దికుంట గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధితో పశువులకు అధిక జ్వరం, నోటిలో పుండ్లు అవుతాయన్నారు. సహాయ సంచాలకులు సంజయ్‌కుమార్, మండల పశువైద్యాధికారి రామచందర్, శ్రీనివాస్‌రావు, నారాయణ, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



టీకా వేసే కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్

ఎల్వోసీ అందజేత

కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే: గర్గుల్ గ్రామానికి చెందిన తనీష్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మంగళవారం రూ.2.50 లక్షల ఎల్వోసీ అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ నాయీ బ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని సంఘం భవనంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్, గౌరవాధ్యక్షులుగా తుకారం, నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఉదయ్‌కిరణ్, కార్యదర్శిగా శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌ప్రసాద్, సాయిలు, హన్మాండ్లు, విజయ్‌కుమార్‌లను నియమించారు.

పాఠశాల తనిఖీ

నిజాంసాగర్, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి ఆరోగ్యకరమైన భోజనం అందించాలని జిల్లా బాలికల జనరల్ కో ఆర్డినేటర్ సుకన్య తెలిపారు. స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలను, ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

బీబీపేట, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం బీబీపేట, ఇస్సానగర్ గ్రామాల్లో మురుగు కాల్వలను, నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. పాఠశాలల తనిఖీ చేపట్టారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పనుల నాణ్యత పరిశీలన

బీర్కూర్, న్యూస్‌టుడే : బీర్కూర్ నుంచి బస్వాపూర్ వరకు చేపట్టిన రోడ్డు పనుల నాణ్యతను మంగళవారం జాతీయ నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ అధికారి సుశీల్‌కుమార్ పండిత్ పరిశీలించారు. తెలంగాణ తిరుమల కొండ నుంచి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం బస్వాపూర్ వరకు 6.4 కి.మీ మేర రూ.3.30 కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. ఈ మేరకు అధికారి బీర్కూర్, మల్లాపూర్, బైరాపూర్, బస్వాపూర్ గ్రామాల్లో పర్యటించి రోడ్డు నాణ్యతను యంత్ర పరికరాల ద్వారా పరిశీలించారు. ఈఈ ఆంజనేయులు, డీఈ శారద తదితరులు ఉన్నారు.



పనుల నాణ్యత పరిశీలిస్తున్న పర్యవేక్షణ అధికారి సుశీల్‌కుమార్

బస్సులు పునరుద్ధరించాలని వినతి

బీబీపేట, న్యూస్‌టుడే: బీబీపేట మండలానికి అరకొర బస్సులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్ కామారెడ్డి ఆర్టీసీ డీఎం ఇందిరాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో మాదిరి బస్సులను పునరుద్ధరించాలని కోరారు. డీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు. వెంట మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం ఉన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిరావాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. తాడ్కోల్‌లో మంగళవారం మాలల ఆత్మగౌరవసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లో జరుగుతున్న సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయ్యాల సంతోష్, బంగారు మైశయ్య, దత్తు, పండరి, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

బీర్కూర్, న్యూస్‌టుడే: చదువు విషయంలో తమ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని సూచించారు. అధ్యాపకులు చంద్రశేఖర్, శ్యామ్, దేవీసింగ్, సౌమ్య, సావిత్రి ఉన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

బాధిత కుటుంబాలకు పరామర్శ

భిక్కనూరు, బీబీపేట: కాచాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బంజర్లకు చెందిన మైదంపల్లి రామారావు మనువడు, మల్కాపూర్ గ్రామానికి చెందిన భారాస నాయకుడు ఆశీగారి శ్రీనివాస్‌గౌడ్ కుమారుడు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం పరామర్శించారు.

సామూహిక పూజలు.. అన్నదానం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోట దుర్గామాత ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

లఘుచిత్రం చిత్రీకరణ

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామ పంచాయతీ పురస్కారానికి ఎంపిక కోసం హైదరాబాద్ పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో లఘు చిత్రం చిత్రీకరణ నిమిత్తం ప్రత్యేక బృంద సభ్యులు మంగళవారం అంకోల్‌క్యాంపునకు వచ్చారు. ఈ మేరకు వివిధ అంశాలపై ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో మాట్లాడి చిత్రీకరించారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, బాన్సువాడ డీఎల్పీవో నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సూర్యకాంత్, మాజీ సర్పంచి రాము, పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఉన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

మద్నూర్, న్యూస్‌టుడే: మద్నూర్ తపస్ మండల నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు రచ్చ శివకాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా పండరినాథ్, ప్రధాన కార్యదర్శిగా అజిత్‌కుమార్, సహాయ అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా శంకర్, సహ ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా సత్యం, మహిళా కార్యదర్శిగా కల్పన తదితరులను ఎన్నుకున్నామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గాంధారి: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి బావయ్య అన్నారు. పోతంగల్ కలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.

బాధ్యతల స్వీకరణ

లింగంపేట, న్యూస్‌టుడే: లింగంపేట మండల నూతన పశు వైద్యాధికారిగా హన్నా జోన్నాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తూకం వేయాలని వినతి

జుక్కల్, నాగిరెడ్డిపేట్ న్యూస్‌టుడే: జుక్కల్‌లో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించి 11 రోజులు అవుతున్నా తూకం వేయడం లేదని భాజపా నాయకుడు ప్రశాంత్ పటేల్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ హిమాబిందు, సొసైటీ కార్యదర్శి బాబురావులకు వినతి పత్రం ఇచ్చారు. నాగిరెడ్డిపేట మండలంలో ధాన్యం కొనుగోలును వెంటనే ప్రారంభించాలని భాజపా నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శ్రీకాంత్, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.



మద్యం దుకాణాల తనిఖీ

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని సాయి, నవదుర్గ మద్యం దుకాణాలను ఆబ్కారీ సీఐ మధుసూదన్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. లైసెన్సులు, ఇతర పత్రాలు పరిశీలించారు. అనంతరం దోమకొండలోని కల్లు దుకాణాన్ని తనిఖీ చేశారు. నమూనాలను సేకరించి, కేసు నమోదు చేశారు. ఎస్సై సుదర్శన్ తదితరులు ఉన్నారు.



తనిఖీ చేస్తున్న ఆబ్కారీ సీఐ మధుసూదన్‌రావు

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే : అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొమ్మన్‌దేవుపల్లిలో చోటుచేసుకుంది. ఇన్‌ఛార్జి ఎస్సై వెంకట్‌రావు కథనం ప్రకారం.. బొమ్మన్‌దేవుపల్లికి చెందిన మాగిడి గంగారాం (45) కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఐదేళ్ల కిందటి నుంచి అతనికి అనారోగ్య సమస్యలున్నాయి. ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదని, చనిపోతానంటూ భార్య గంగామణికి పలుమార్లు చెప్పారు. సోమవారం బహిర్భూమికి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లారు. సాయంత్రం గ్రామ శివారులోని దాల్‌మాల్ చెరువు కట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పశువుల కాపరి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బాన్సువాడ ప్రాంతీయ దవాఖానాకు తరలించారు. మంగళవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌ఛార్జి ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



గంగారాం

చెరువులో పడి వృద్ధురాలి మృతి

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరు బొబ్బిలి చెరువులో పడి తిప్పాపూర్‌కు చెందిన వృద్ధురాలు జొర్రిగల దుర్గవ్వ(65) మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేక తరుచూ ఇంట్లో నుంచి వెళ్లిపోయేది. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన దుర్గవ్వ తిరిగి రాలేదు. బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు పడి చనిపోయినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భర్త మల్లయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్రవాహనం దహనం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: చిన్నమల్లారెడ్డిలో గుర్తుతెలియని దుండగులు ముదాం గోపాల్‌కు చెందిన టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు వివరించారు.

జూదరుల అరెస్టు

బిచ్కుంద, న్యూస్‌టుడే: కందర్‌పల్లిలో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారినుంచి రూ.18,440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

ఎనిమిది వాహనాల జప్తు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రం శివారులోని టేక్రియాల్ చౌరస్తా సమీపంలో దేవునిపల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబర్‌ప్లేట్‌లు లేని, నంబర్లు మార్ఫింగ్ చేసిన ఎనిమిది వాహనాలను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

బీమా పైకం అందజేత

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సఫాయి కార్మికుడిగా పనిచేసి మృతిచెందిన దుర్గయ్య కుటుంబానికి రూ.80వేల చెక్కును మున్సిపల్ ఛైర్మన్ పద్మశ్రీకాంత్ మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: నూతనంగా నియమితులైన ఎల్లారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ పద్మశ్రీకాంత్‌ను మంగళవారం జిల్లా పద్మశాలీ సంఘం సభ్యులు సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, బాన్సువాడ మున్సిపల్ ఛైర్మన్ జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.